
# శ్రీధర కథలు

## ఎలక్షన్నొచ్చి...

ఎలక్షన్ల జోరు, హోరు పుంజుకుంటోంది. ఈసారి కూడా మళ్లీ నరసింహంగారే ఆ నియోజకవర్గం నుంచి గెలుస్తారన్న అభిప్రాయం అందరికీ ఉంది. కానీ ఆయన ప్రచారంలో ఏ మాత్రం లోటు రాని వ్వటం లేదు.



ఉదయం ఆరు గంటలకే ఆయన ఇంటి ముందు అనుచరగణమంతా చేరి పోతున్నారు. కాఫీ టిఫెన్లకు ఆయన ఇంట్లో ఇప్పుడూ, ఎప్పుడూ లోటు ఉండదు. పది కార్లు, పది టాటా సుమోలు కిటకిటలాడే జనంతో బయల్దేరుతాయి. ఆ రోజు ఏ నగరంలో, ఏ పట్టణంలో, ఏ పల్లెల్లో ప్రచారం చెయ్యాలో ముందే నిర్ణయం అయిపోయింది గనుక, అక్కడికి కార్లు, వ్యాన్లు చేరేటప్పటికి స్థానికులంతా ఎదురొచ్చి మేళ తాళాలతో, హారతులతో, పూల మాలలతో ఆయనకు స్వాగతం చెబుతున్నారు.

ఆయన ప్రతి మనిషినీ పలకరించి కష్టసుఖాలు తెల్సుకుంటున్నారు. ప్రతి ఊరి వాళ్లూ గతంలో ఆయన దగ్గర నుంచి అంతో ఇంతో ప్రయోజనం పొందిన వాళ్లే గనుక. అమిత గౌరవంతో ఆయనకు స్వాగతం చెప్పి, వెంట నడుస్తున్నారు. 'మీ వెనుక మేం ఉన్నాం' అంటూ.

''గత అయిదేళ్లలో ఎం.పిగా ఉన్నప్పుడు నాకు ఎంతమంది సేవ చేశారన్నది కాదు. నేను ఎంత మందికి సేవ చేశానన్నదే – ప్రతి రోజూ బేరీజు వేసుకుంటూ వచ్చాను. చేయగలిగినంతా చేశాను. కానీ మనది నిరుపేద దేశం. అరవై ఏళ్ల తరువాత కూడా కడుపు నిండా అన్నం తిని, ఒంటి నిండా బట్టకట్టుకుని, కంటి నిండా నిద్రపో గలిగిన వాళ్ల సంఖ్య జనాభాలో నాలుగో వంతు కూడా లేదు. మిగిలిన మూడొంతుల మందికి బ్రహ్మరాసిన దారిద్ర్యరేఖను చెరిపేసి, ఉన్నంతలో తృప్తిగా బ్రతకగలిగే రాత రాయాలన్న తాపత్రయంతో అహర్నిశలూ పోరాడుతున్నా. కానీ దారపు ఉండ తన చుట్టూ తాను చుట్టుకుపోయినట్లుగా, కొందరు స్వార్థపరులు సంపదనంతా తమ సొంత ఆస్తుల కింద మార్చుకుంటున్నారు. ఈ పద్ధతి మారనంతవరకూ ఉన్న వాడికీ, లేనివాడికీ మధ్య అంతరం తగ్గదు...'' అంటూ నరసింహం చేస్తున్న ప్రసంగాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి.

ఆ వేళ కూడా ప్రచారం ముగించుకుని ఇంటి కొచ్చేటప్పటికి రాత్రి పదకొండు గంటలైంది. అనుచర వర్గమంతా భోజనాలు చేయటానికి బంగళా వెనకవైపు కెళ్లారు.

ఆయన మేడ మీదకెళ్లి, వేన్నీళ్ల స్నానం చేసి, లుంగీ కట్టుకుని పల్చని లాల్చీ వేసుకుని హాల్లోకి వచ్చి కూర్చున్నారు.

పంకజం అప్పటికే డ్రింక్స్, స్నాక్స్ అన్నీ సిద్ధం చేసింది.

''జానకికి ఎలా ఉంది? మందులు వేసుకుందా?'' అని అడిగాడు ఆయన.

''మందులు ఇచ్చానయ్యా. మజ్జిగన్నం తిని పడుకున్నారయ్యా...'' అన్నది పంకజం గోడకానుకుని కింద కూర్చుని.

''ఏమిటోనే... బయటజనం ఎంత బ్రహ్మరథం పట్టినా, ఇంట్లో జానకిని ఈ స్థితిలో వదిలి వెళ్తున్నందుకే బాధగా ఉంది...''

''అమ్మగార్ని నేను సూసుకుంటాన్లెండయ్యా...''

''నువ్వు ఉన్నావన్న ధైర్యంతోనే, బయటకెళ్తున్నాను...''

''కానీ...'' అని ఆగిపోయింది పంకజం.

నరసింహం ఏమిటన్నట్లు చూశాడు. పంకజం ఒకసారి ఆయన వంక సాలోచనగా చూసి తలొంచుకుంది.

''ఏమిటో చెప్పు...'' అన్నాడు నరసింహం.

''నా కెందుకో భయంగా ఉందయ్యా... ఈ ఎన్నికలొచ్చి...''

''దేనికి భయం?'' అన్నాడాయన విస్కీ తాగుతూ.

''సాయంత్రం మా అయ్య వొచ్చాడు..''

''ఇన్నాళ్లకు నువ్వు గుర్తొచ్చావన్న మాట... తాగుడుకు డబ్బు కావాలంటనా?'' అని అడిగాడు.

''ఏదో పెద్ద కుట్ర జరుగుతోందయ్యా....''

''కుట్రా?'' అని నవ్వాడు నరసింహం. ''విషయం ఏమిటో చెప్పు...''

''మా అయ్య నన్ను తీసుకెళ్లి పోతాడంట...'' అన్నది తలొంచుకునే.

''తీసుకెళ్లి ఏం చేస్తాడే.... వాడికి ఎన్నిచోట్ల ఎన్నిపనులు ఇప్పించాను? ఒక్కచోటన్నా కాలు నిలదొక్కుకున్నాడా? తెగిన గాలి పటంలా గాలికి తిరగటానికి అలవాటు పడ్డాడు. వాడికే తిండికి లేదు.... నీకు ఎక్కడి నుంచి తెచ్చిపెడతాడు?'' అని అన్నాడు నరసింహం.



''అదంతా నిజమేనయ్యా... ఇప్పుడు ఎలక్షన్లొచ్చాయి గదా. మీరు పోటికి దిగారు గదా. ఎగస్పార్టీ వాళ్లు మిమ్మల్ని ఓడించటం కోసం...'' అని ఆగిపోయింది పంకజం.

''నన్ను ఓడించటం వాళ్లతరం కాదు...'' అన్నాడాయన విస్కీ గ్లాసు అందుకుంటూ.

''అందుకే... మీ పరువు తియ్యాలని...''

''ఏం చేస్తారు?'' అని ఆయన పంకజం వంక చూశాడు. దాని కళ్లల్లో సుళ్లు తిరుగుతున్న కన్నీరు చూసి ఆశ్చర్యపోయాడు.

''మా అయ్యను పావులా వాడుకుంటున్నారు. డబ్బుతో కొనేస్తున్నారు...''

''అర్థమయ్యేలా చెప్పవే..''

''మీరు నన్ను ఉంచుకున్నారని...'' కన్నీరు తుడుచుకుంటోంది పంకజం.

''ఏడిశారు... ఎధవలు..''

''రేపు పొద్దునే మా అయ్య మీ దగ్గరకొస్తాడట. నన్ను తీసుకెళ్లిపోతానని అడుగుతాడంట... పంపియ్యక పోతే... నన్ను మీరుంచుకున్నారని, అందుకనే తండ్రి దగ్గరకు పంపటం లేదని... పేపర్లోళ్లకీ, టీవీల వాళ్లకు చెబుతాడంట'' అని ఆగిపోయింది పంకజం.

తాగుతున్న విస్కీ మింగుడు పడలేదు ఆయనకు – నీలకంఠుడికి విషయం మింగుడుపడనట్లు

చాలాసేపు ఆలోచనలో మునిగిపోయి, చివరకు నిట్టూర్చి ''ఊ... అయితే.... పెద్దప్లానే వేశారన్న మాట...'' అని అన్నాడు.

''అయ్యా నన్ను ఆ తాగుబోతోడికి అప్పగించకండయ్యా.... మీ కాళ్లు పట్టుకుంటాను....'' అన్నది పంకజం ముందుకు వంగి ఆయన పాదాలు స్పృశించబోయి.

''చూద్దాం.... ఏం జరుగుతుందో...'' అన్నాడాయన మళ్లీ ఆలోచనల్లో మునిగిపోతూ.

నరసింహం తెల్లవారు ఝామున అయిదింటికి లేచి భార్య గదిలోకి వెళ్లాడు. అప్పటికే పంకజం ఆమెను బాత్‌రూంలోకి తీసుకెళ్లి స్నానం చేయించి తీసుకొచ్చి, ఇస్త్రీ చీరకట్టి, రవిక తొడిగి, తల దువ్వుతోంది. ఆయన వచ్చి భార్య కెదురుగా కూర్చున్నాడు.

''ఎలా ఉంది జానకీ?'' అని అడిగాడు.

''క్షణం క్షణం చావుకు దగ్గర పడుతున్నాను. పంకజాన్ని అనవసరంగా శ్రమ పెడుతున్నాను... ఇది ఆరిపోయే దీపం... నా బాధ, బెంగ అంతా మీ గురించే... మీకు బయటిగొడవలే తప్ప, ఇంటి విషయాలు పట్టవు, తిరిగి తిరిగి అర్ధరాత్రి ఇంటికొస్తే – తిన్నారా, లేదా – అని అడిగే వాళ్లు ఎవరుంటారు?'' అని కన్నీళ్లు పెట్టుకుంది జానకి.

ఆమె రాల్చిన కన్నీటిచుక్కల్లో, రానున్న ఒంటరి జీవితమంతా కనిపించింది. దృష్టి దోషం లేని వాడు టెలిస్కోప్‌లో కూడా కనిపించని విషయాలను, కన్నీటి చుక్కల్లో చూడగలుగుతాడు.

పంకజం ఆమెకు కాఫీ తేవటానికి వెళ్లింది – భార్యాభర్తలకు ఏకాంతం కలిగిస్తూ.

''నేను ఉన్నా లేనట్లే లెక్క. ఇంటెడుచాకిరీ పంకజమే చూసుకుంటోంది.... వచ్చేపోయే వాళ్లకు జరగవల్సిన మర్యాదలన్నీ అదే చూసుకుంటోంది.... బంగారంలాంటి పిల్ల... నా మాట విని మీరు దాన్ని చేసుకోండి... మీరు దానికి దేవుడితో సమానం...'' అన్నది జానకి.

''ఏం మాటలు జానకీ అవి? పదేళ్ల పిల్లగా ఉన్నప్పుడు అది మన ఇంటికొచ్చింది. దాన్ని పనిపిల్లగా ఏనాడూ మనం చూడ

లేదు. మనింట్లో మన కళ్ల ముందు ఆడుతూ పాడుతూ పెరిగింది... మనకు ఆడపిల్ల లేని లోటు తీర్చింది... పేదరికంలో పుట్టినంత మాత్రాన దాన్ని మన అవసరాలతో కట్టిపడేస్తామా చెప్పు... పోనీ అమెరికా నుంచి ఆనంద్‌ని కోడల్ని పిలిపించమంటావా?'' అని అడిగాడు.

''వద్దొద్దు. అసలే వాళ్ల ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయోనన్న టెన్షన్‌లో రాత్రిళ్లు నిద్ర పట్టటం లేదని కోడలు చెప్పింది. వాళ్లని మరింత కంగారు పెట్టకండి...'' అన్నది జానకి.

నరసింహం నిత్యకృత్యాలు ముగించుకుని అయిదు నిముషాలు దైవప్రార్థనలు చేసుకుని, అల్పాహారం చేస్తుండగా, పంకజం తండ్రి మల్లేశం వచ్చాడు.

అంతకు ముందే సిద్ధం చేసి పెట్టుకున్న కాంకార్డర్ 'ఆన్' చేశాడు నరసింహం.

మల్లేశాన్ని వచ్చి కూర్చోమన్నాడు. టిఫెన్ చెయ్యమన్నాడు. పొద్దునే కాఫీకి బదులు అతనికి అలవాటైనదేదో తాగి వచ్చినట్లున్నాడు – కొంచెం తూలుతున్నాడు.

''నా డాటర్ని తీసుకెళ్దామని వచ్చాను...'' అన్నాడు మల్లేశం.

''తీసుకెళ్లు. దానికేముంది? నీ డాటర్ నీ ఇష్టం...'' అన్నాడు నరసింహం.

''థాంక్స్... మీరు అడ్డు చెబుతారేమోనని భయపడ్డాను...''

''భయమెందుకు? నీ కూతుర్ని తీసుకెళ్లాలని ఇన్నాళ్లకి గుర్తొచ్చినందుకు సంతోషం. ఎన్నేళ్లయింది – దాని మా ఇంట్లో వదిలి?'' అని అడిగాడు.

''అది పదేళ్ల పిల్లగా ఉన్నప్పుడు దాని తల్లి చనిపోయింది. అదిపోయిన నెల రోజులకే దీన్ని మీ ఇంట్లో పెట్టాను...'' అన్నాడు మల్లేశం.

''మధ్యలో ఎన్నిసార్లొచ్చావ్ నీ కూతుర్ని చూడటానికి?...''

''నేను చూడటానికి రాకపోతేనేం.... మీరు బాగా చూసుకుంటున్నారు గదా...''

''ఇప్పుడు పంకజానికి పాతికేళ్లు నిండాయి.. పెళ్లి ఈడు వచ్చింది. పెళ్లి చేస్తావా?''

''చేస్తాను... ఎందుకు చెయ్యను?''

''డబ్బు ఎక్కడిది?''

''డబ్బు దేముంది? కుక్కను కొడితే రాలుతుంది...''

''ఇప్పుడే కుక్కను కొట్టావ్? అపోజిషన్ పార్టీ వాళ్లు నీకు పది లక్షలు ఇచ్చారని, వాళ్లు ఆడించినట్టు ఆడటానికి ఒప్పుకున్నావని.... ప్రత్యక్షంగా చూసిన వాళ్లు చెప్పారు...''

''ఎవడు? అప్పారావు చెప్పాడా? ఎదవ.... లక్ష రూపాయలు ఇస్తానన్నాడు. రెండు అడిగాను. సరే నన్నాడు...''

''అసలు వాళ్ల దగ్గర పది లక్షలు తీసుకుని, అప్పారావు నీకు ఒకటో, రెండో విదిలిస్తున్నాడు... మిగిలింది వాడు నొక్కేశాడు. గట్టిగా నిలదీసి అడుగు... పది ఇస్తేనే, వాళ్లు చెప్పినట్లు వింటానని చెప్పు...''

''కరెక్టేనండి... మీరు చెప్పినట్లు చేస్తాను... అరె.... నా పరువు... నా కూతురి పరువు... వోన్లీ టూ లాక్సా? అంత చీపా?''

''మీ ఇద్దరి పరువు కాదు. నా పరువు కూడా ఉంది. అందుకని యాభై లక్షలు అడుగు...'' అన్నాడు నరసింహం.

''ఇస్తారంటారా?'' అని సందేహంగా అడిగాడు మల్లేశం.

''ఎలక్షనొచ్చినయి... లక్షలు, కోట్లు చేతులు మారతాయి. అందులోనూ ఇది మన ప్రిస్టేజ్ క్వశ్చన్ గదా...'' అన్నాడు నరసింహం.


''అలాగే అడుగుతాను'' అన్నాడు మల్లేశం...

''మరి నా డాటర్?''

''నీ డాటర్ నీతో వస్తే ఇంక బేరం కుదరదు. ముందు బేరం కుదుర్చుకుని రా... అప్పుడు పంకజం నీతో వస్తుంది...'' అని చెప్పాడు నరసింహం.

మల్లేశం 'అలాగే' నంటూ ఊగుతూ, తూలుతూ వెళ్లాడు.

అప్పారావు దగ్గరకెళ్లి రేటు పెంచాడు మల్లేశం. ఈ తాగుబోతు వెధవ ఎక్కడ చెయ్యిజారి పోతాడోనని – అర్జంటుగా ప్రెస్‌మీట్ పెట్టి మల్లేశం చేత చెప్పవల్సిన వన్నీ చెప్పించాడు.




మధ్యాహ్నం నుంచీ టీ.వీ. ఛానల్స్‌లో మల్లేశం కనిపించి తన చిలక పలుకులు అప్పగించాడు. ఛానల్స్ వాళ్లు మరికొంత కవిత్వం ఒలకబోసి నరసింహాన్ని పెద్ద దోషి కింద రూపొందించారు.

రాత్రి ఇంటికొచ్చి, నరసింహం టీ.వీ.లో మల్లేశం ప్రకటన చూశాడు.

''నా భార్యపోయాక, నా ఉద్యోగం పోయాక, డబ్బు ఇబ్బందుల్లో ఉండి నా కూతుర్ని నరసింహం గారింట్లో పనికి పెట్టానండి. మొదట్లో ఎట్టి చాకిరీ సేయించుకుని, కొట్టి తిట్టినా కూతుర్ని నానా కష్టాలు పెట్టారండి. ఇప్పుడాయన భార్యకు జబ్బుగా ఉందండి. ఆమె సంసారానికి పనికిరాదని ఇంక నా కూతుర్ని ఉంచేసుకున్నాడండి. వాడుకుంటున్నాడండి. నా కూతుర్ని అప్పగించమని అడగటానికి కెళ్తే, నౌకర్ల చేత గెంటించాడండి... అమాయకురాలు నా కూతుర్ని సెరిపేసి దాని జీవితం బుగ్గిపాలు సేసాడండి...'' అని మల్లేశం చెప్పిన విషయాలకు టీ.వీ. ఛానల్ వాళ్లు ఇంకొంత పైత్యం జతచేశారు. సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న కొంతమంది జీవితాల చీకటికోణాల్లోకి తొంగి చూస్తే, వారి కర్కశ, కఠిన కరాళ దంష్ట్రాగ్నుల మధ్య చిక్కి దహించుకుపోతున్న వారి దయనీయమైన కన్నీటి గాథలెన్నో కనిపిస్తయి – అంటూ ఊదర కొట్టేస్తున్నారు.

ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూసి, ఘోరం జరిగిపోతోందని విలవిల్లాడే ఛానల్స్ వాళ్లకి ఇలాంటి వార్త దొరికితే, విందు భోజనం దొరికినట్లే – అందులోని నిజానిజాలతో వాళ్లకు పని లేదు. యధార్థాన్ని తెల్సుకుందామన్న ప్రయత్నమూ చేయరు.

మర్నాడు నరసింహం తన ప్రచార యాత్రని బ్రేక్ చేసి, అర్జెంటుగా ప్రెస్ మీట్ పెట్టాడు.

మల్లేశం చేసిన అభియోగంలో ఎంతమాత్రం నిజం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆయన మీద పడింది గనుక – అసలు విషయాలు వెల్లడించాడు.

''పంకజం మల్లేశం కూతురు. ఆ పిల్ల పదేళ్ల వయసులో ఉండగా తల్లిపోయింది. తండ్రి తాగొచ్చి చావగొట్టటం వల్లనే ఆమె చనిపోయింది. పిల్లను పెంచలేని స్థితిలో ఉండగా నేను చేరదీశాను. పంకజానికి ఏ లోటూ లేకుండా చూడడమే కాదు. మా ఇంట్లో ఆడపిల్ల లేనిలోటు తీర్చింది. ఇప్పుడు నా భార్య ఆరోగ్యం బాగులేదు. అంచేత ఇంటి వ్యవహారాలు కొంత వరకూ పంకజం చూసుకుంటోంది.... ముఖ్యంగా నేను చెప్పదల్చుకున్నదేమంటే పంకజాన్ని నేను పెంచుకున్నాను. నేను ఆ పిల్లను ఉంచుకున్నట్లు ప్రచారం చేయటానికి ఒక రాజకీయ పార్టీ కుట్ర పన్నింది... అందుకు సాక్ష్యం ఈ టేపు చూడండి..'' అంటూ కిందటి రోజు ఆయనకు మల్లేశానికీ జరిగిన సంభాషణను అందరికీ విజువల్స్‌లో చూపించాడు నరసింహం.

అక్కడికీ ఛానల్స్ మేధావులు ఆయన్ను వదలేదు. వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని చూడవల్సిన

బాధ్యత కూతురికి లేదా – తండ్రిని ముసలితనంలో వదిలెయ్యటం అన్యాయం కాదా – అని ప్రశ్నలు సంధించారు.

తండ్రి నడి వయసులో ఉన్నప్పుడు కూతుర్ని గాలికొదిలేసి, వార్ధక్యంలో ఆమె వచ్చి సేవ చేయాలనటం న్యాయమేనా? అన్న అంశంపై ఆ రాత్రికి టీవీలో చర్చ జరిగింది. ఎవడిష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడారు. అయితే అందరు మనుషులు ఒకలా ఉండరు. అందరు తండ్రుల ప్రవర్తనా ఒకలా ఉండదు. తండ్రి నీడనే పడగనీడలా భయపడే అమ్మాయిలూ అక్కడక్కడ ఉన్నారని, వారిని అందరితో కలిసి ఒకే గాటిన కట్టెయ్యలేమని – మర్చిపోయారు విజ్ఞులైన వక్తలు.

ఈ దుమారం చల్లారేలాగా లేదు. నరసింహం పంకజంను పిల్చాడు.

''నువ్వు మీ నాన్న దగ్గరకు వెళ్లు. ఎన్నాళ్లు ఉండగలిగితే అన్నిరోజులు ఉండు. ముఖ్యంగా ఎన్నికలు అయ్యే దాకా. ఆ తరువాత నువ్వు ఎప్పుడు రాదల్చుకుంటే అప్పుడు...రా'' అని చెప్పాడు.

పంకజం ఏడుపు ముఖంతోనే తండ్రి దగ్గరకు వెళ్లింది. ఇదంతా తమ ఘనకార్యమనే టీ.వీ ఛానల్ రెండు రోజులు ఊదర కొట్టింది.

ఎలక్షన్లు అయిపోయాయి

వారం రోజులు తరువాత ఎన్నికల ఫలితాలు వచ్చాయి.

నరసింహం చాలా స్వల్ప మెజారిటీతో గెల్చాడు.

టీ.వీ. ఛానల్ వాళ్లు ఆయన్ను ఇంటర్వ్యూ చెయ్యటానికి నరసింహం ఇంటికెళ్లారు. ఇంట్లో ఆయన లేరు. అనుచుల హడావుడి లేదు.

అంతా నిశ్శబ్దం.... తోట మాలిని అడిగితే – ఎక్కడి కెళ్లారో తనకు తెలియదన్నాడు.

మళ్లీ టీ.వీలో గోల... ప్రజలు బాగోగులు చూస్తానని నిన్నటి దాకా ఇల్లిల్లూ తిరిగిన ఎంపి. ఇవాళ ఎక్కడున్నాడో, ఏమైనాడో తెలియదు. ఇదీ వీరి ప్రజాసేవ... అంటూ వ్యాఖ్యానాలు.

నిజానికి రిజల్టు వస్తున్న సమయంలో జానకి చావుబతుకుల్లో ఉంది. నరసింహం ఆమె మంచం పక్కన హాస్పటల్‌లో ఉన్నాడు.

ఆ రోజు సాయంత్రం ఆమె తుది శ్వాస విడిచింది. అమెరికా నుంచి కొడుకు రావటానికి ఇంకో రోజు పట్టింది. ఇది తన స్వంత విషయం గనుక ఎవరికీ తెలియనివ్వలేదు నరసింహం – దగ్గర బంధువులకు తప్ప.

టీ.వీలో ఊదర చూసి అందరూ బాధపడ్డారు. అసలు వాళ్లు మనుషులేనా – అని అసహ్యించుకున్నారు. తను ఎంపి కాకపోయి ఉంటే దానికి జవాబు చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఇప్పుడాయన ప్రజల మనిషి. అపోహ తొలగించాల్సిన అవసరం ఉంది.

అందుకని మళ్లీ ప్రెస్‌మీట్ పెట్టి – లైవ్ టెలికాస్ట్ చేయిస్తూ ప్రజలందరికీ చెప్పాడు.

''నిజానికి ఎన్నికల ముందు కోలాహలం. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పుడు మా ఇంటి దగ్గర లేదు. అందుకు కారణం – ముప్పయి అయిదు సంవత్సరాల పాటు నిద్రాహారాలు మాని నాకు సేవ చేసిన నా భార్య మృత్యువుతో హోరాహోరీ పోరాడుతూ ఆస్పత్రిలో ఉంటే, నేను ఆమె చేతిని నాచేతిలోకి తీసుకుని నిస్సహాయంగా చూస్తుండిపోయాను. నన్ను నిలువునా సగానికి కోసి, ఆ సగ భాగాన్ని యముడు లాక్కొనిపోతున్న సమయంలో – విజయోత్సవం చేసుకోవాలన్న ఆలోచన రాలేదు...''

అని ఆయన చెబుతుండగానే, నరసింహం కొడుకు ఆనంద్ ఆయనకు సెల్‌ఫోన్ అందించాడు. ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఆయన తన ప్రసంగం కొనసాగించాడు.

''ఎన్నికల ముందు పంకజాన్ని మా ఇంట్లో ఉంచుకున్నందుకు మీరంతా నామీద ఎంత దుష్ప్రచారం చేశారో అందరికీ తెల్సు.... మా దగ్గర ఏ తప్పూ లేకపోయినా, లోకాన్ని నమ్మించటం కోసం పంకజాన్ని ఆమె తండ్రి దగ్గరకు పంపించాను. కానీ ఈ కొద్ది రోజుల్లో ఆమె తండ్రి ఏం చేశాడో మీకు తెల్సా? తెల్సుకోవలసిన అవసరం మీకులేదా– అని అడుగుతున్నాను... కన్న తండ్రి ఆమెను వేశ్యా గృహానికి అమ్మేశాడు. పోలీసుల రైడింగ్‌లో ఆమె పట్టుబడింది. ఇప్పుడు నాకు ఫోన్ చేసిన పోలీసు ఆఫీసర్ ఆమెను ఏం చెయ్యమని అడుగుతున్నాడు.... ఆమె తనంత తానుగా ఆ పనికి అంగీకరించలేదు. ఆమెను అమ్మేసిన తండ్రిని, తండ్రికి అలాంటి అవకాశాన్ని కల్పించిన టీవీ ఛానల్ రిపోర్టర్‌ని అరెస్టు చేయమని చెప్పాను..'' అని ముగించాడు నరసింహం.

మీడియా వాళ్లంతా తలొంచుకుని వెళ్లిపోయారు.

ఒక గంట తర్వాత పంకజం వచ్చింది. నరసింహం ఆమెను లోపలికి వెళ్లమన్నాడు.

వారం రోజుల తర్వాత నరసింహం ఢిల్లీ వెళ్లాడు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి.

ఒక రోజు రాత్రి పంకజం ఆయనకు ఫోన్ చేసింది.

''మీ అనుమతి లేకుండా పెళ్లి చేసుకున్నాను... క్షమించండి'' అని చెప్పింది.

మర్నాడే నరసింహం ఇంటికి వచ్చాడు. పంకజం భర్తను పరిచయం చేసింది.

''సైకాలజీలో లెక్చరర్...'' అని చెప్పింది.

''మీ ఇద్దరికీ పరిచయం ఎలా అయింది?'' అని అడిగాడు నరసింహం.

''పంకజం వ్యభిచార గృహంలో ఉండగా, వ్యభిచారిణుల మనస్తత్వం పరిశీలించటం కోసం ఒక కస్టమర్‌లాగా పంకజం దగ్గరకు వెళ్లాను. ఈ లోకంలో మల్లేశం లాంటి తండ్రి, నరసింహంగారి లాంటి తండ్రీ ఉంటారని తెల్సుకున్నాను... పంకజం కోరిక మీద నేనే ఆ ఇంటి మీద రైడింగ్ చేయించి, ఆమెను విడిపించాను'' అన్నాడు ఆ లెక్చరర్.

''ఇదంతా ఎన్నికలు వచ్చినందువల్ల వచ్చిన గొడవ'' అన్నది పంకజం.

''పెద్దతుఫాను వచ్చి వెలిసాక, బీభత్సం జరిగాక బాగా తడిసిన మట్టిలో నుంచి చిన్న మొలక తలెత్తింది..'' అన్నాడు లెక్చరర్,

''నా చేతికీ ఓ చిన్న మరువపు మొలకను అందించండి. ఏడాది తిరిగే లోపల...'' అని నరసింహం అక్కడి నుంచి లేచి కిందకు వచ్చాడు.

''నీదే ఆలస్యం'' అన్నాడు లెక్చరర్.

''కాదు... నీదే...'' అన్నది పంకజం సిగ్గుల మొగ్గ అవుతూ.

*

రచయిత కోరిక మేరకు ఈ కథలు ఈ వారంతో నిలిపివేస్తున్నాం.

– సం.

## అనుష్కా బాటలో నయనతార....!



అతీతశక్తుల ఆధారంగా రూపొందిన 'అరుంధతి'లో ప్రధాన పాత్ర పోషించి సినీ ప్రేక్షకుల మనసు దోచుకున్న అనుష్క బాటలో నయనతార కూడా పయనించనుంది.. దైవశక్తి ప్రధానాంశంగా రూపొందనున్న ఓ చిత్రంలో నయనతార నటిస్తోంది. గతంలో ఇదే కథాంశంగా వచ్చిన దేవి, అమ్మోరు చిత్రాలు మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే! దేవి, అమ్మోరు సాధించిన విజయాలను దృష్టిలో పెట్టుకొని నయనతార ఈ పాత్రను అంగీకరించినట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలు అన్నీ మంచి విజయాన్ని సాధించాయని, నయనతారకి కూడా ఈ చిత్రం అంత పేరు తీసుకువస్తుందని అంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.